క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మౌలాలిస్వామి సరిగెత్తు


దివిటీల వెలుగులో మౌలాలి స్వామి ఊరేగింపు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో మౌలాలి స్వామి సరిగెత్తు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. స్వామివారిని దివిటీల వెలుగులో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు కాయ, కర్పూరాలు, దట్టీలు, పూల షేరాలు సమర్పించి, కందుర్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఖాళీ ప్రదేశాల్లో చెత్తవేయొద్దు


ముసలిమడుగులోని ఖాళీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో చెత్తవేసి పరిసరాలను అపరిశుభ్రం చేయరాదని ఎంపీడీఓ దాసరి మేరి సూచించారు. శుక్రవారం కొక్కెరంచ, ముసలిమడుగు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లల్లోని తడి, పొడి చెత్తలుగా వేరువేరు డబ్బాల్లో నిల్వ ఉంచుకుని చెత్తసేకరణ బండ్లలో మాత్రమే వేయాలన్నారు. ఆమె వెంట ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ పార్థసారధి, పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి తదితరులు ఉన్నారు.

యూరియాను అందుబాటులో ఉంచాలి


మాట్లాడుతున్న జిల్లా నాయకులు

నందికొట్కూరు: యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎరువులు, మందులు సరఫరా చేయకపోవడం దారుణమన్నారు. రైతులు బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేస్తూ అప్పులపాలవుతున్నారన్నారు. సమావేశంలో ఐసా నాయకులు నాగార్జున, రైతు సంఘం నాయకులు గాబ్రియేలు సన్న, రామకృష్ణ, బీబీ, లక్ష్మిదేవి, ముర్తుజాబి పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అనంతరం శ్రీశైలంలోని అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీశైల దేవస్థానానికి రూ.లక్ష విరాళం


దాతని సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఆర్.రవికుమార్ రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు కె.అయ్యన్నకు అందజేశారు. దాతకు రసీదు, లడ్డూ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.

అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

ఆత్మకూరు: తాము ఎన్నో యేళ్లుగా ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నామని, తమను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ నాయకులు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి క్రవారం వినతి పత్రం అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

బాబు ష్యూరిటీ..

భవిష్యత్‌కు నో గ్యారెంటీ!

- సూపర్-6 పథకాల కోసం ప్రజల ఎదురుచూపులు
- కూటమి నేతలు ఇచ్చిన హామీలకు మంగళం
- కూటమి ప్రభుత్వం అమల్లోకి వచ్చి ఏడాది పూర్తయింది.



బండిఆత్మకూరు: ఎన్నికల ముందు టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడి అడ్డదిడ్డమైన హామీలిచ్చి అధికారంలోకి వచ్చాయి. అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పాలకులు నిలువునా మోసం చేశారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మరోవైపు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను సైతం కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తోంది. ఇప్పటికే ఇంటింటికీ పెన్షన్, రేషన్ పంపిణీని రద్దు చేసి లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తోంది. నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1,500, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలతోపాటు 144 పథకాలను అమలు చేస్తామని ప్రజలను బురిడీ కొట్టించి ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు.

పెట్టుబడి సాయం ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద వెంటనే రూ.20 వేల చొప్పున ఇవ్వాలి. ఇప్పటికే ఖరీఫ్ ప్రారంభమైంది. అప్పులు చేసి విత్తనాలు వేశాం. పెట్టుబడి డబ్బులిస్తే కనీసం మందులకైనా ఉపయోగపడతాయి – అగుడూరు బలరామిరెడ్డి, రైతు, జీసీ పాలెం

లా నేస్తం పథకం అమలు చేయాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రాక్టీస్ చేసే జూనియర్ లాయర్లకు లానేస్తం పథకం ద్వారా రూ.5 వేలు అందించి వారికి అండగా నిలిచారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో రూ.10 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదు. ఆ డబ్బులు న్యాయవాదులకు వెంటనే చెల్లించాలి. – బోయ సుబ్బరాయుడు, న్యాయవాది ఎర్రగుంట్ల

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో



సూపర్-6 పథకాల్లో భాగంగా ఎన్నికల హామీల్లో కూటమి ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పింది. మహిళలు ఉచిత బస్సు ప్రయాణ కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి. – రాజంరెడ్డి సుజాతమ్మ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు

నిరుద్యోగ భృతి ఏదీ?



ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ఇంటింటికి ఒక ఉద్యోగం ఇస్తామని చెప్పారు. ఉద్యోగం ఇవ్వలేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారం చేపట్టి ఏడాదైంది. నిరుద్యోగ భృతి ఏదీ?. ఇప్పటికైనా నిరుద్యోగ భృతి ఇచ్చి.. మాట నిలబెట్టుకోవాలి. లేకపోతే ఈసారి చంద్రబాబును ఎవరూ నమ్మరు. – కల్యాణ్, నారాయణపురం

మహానందిలో న్యాయమూర్తి పూజలు


మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన న్యాయమూర్తి లీలావతి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో కర్నూలు నాలుగవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి లీలావతి శుక్రవారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన న్యాయమూర్తి లీలావతికి ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. న్యాయమూర్తి కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేపట్టారు. అలంకార మండపంలో వేదపండితులు శాంతారాంభట్ స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఆర్టీసీ దర్శన యాత్రకు స్పందన


వేలాంగిని క్షేత్రానికి బయల్దేరుతున్న యాత్రికులు

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దర్శన యాత్రకు విశేష స్పందన లభిస్తుందని డిపో మేనేజర్ గంగాధర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం తమిళనాడు వేలాంగిని మాత క్షేత్ర దర్శనం కోసం బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై మాసంలో గురు పౌర్ణమిని పురస్కరించుకొని అరుణా చలానికి వేలాంగిని మాత క్షేత్రానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. అదే విధంగా ఆగస్టు మాసంలో 16వ తేదీన మహాకాళేశ్వరం రానుపోను రూ.2,500, వేలాంగిని మాత క్షేత్ర దర్శనం ఆగస్టు 8న రానుపోను కలిసి రూ.2,800, గోవా యాత్రకు 22వ తేదీన రానుపోను చార్జీలు రూ.3,400 అవుతుందన్నారు. ఒక సమూహంగా వస్తే, ధార్మిక సంస్థలు, ఆధ్యాత్మిక సంస్థలు బృందంగా వచ్చినా బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9505065651ను సంప్రదించాలన్నారు.

పీ-4 సర్వేను విజయవంతం చేయండి

వెలుగోడు: మండలంలో చేపట్టే పీ-4 సర్వేను విజయవంతం చేయాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పీ-4 సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్(పి-4) సర్వేకు కార్యాచరణ రూపొందించిందన్నారు. పేదల అవసరాలను గుర్తించి వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్ట్ రూపకల్పనకు ఈ సర్వే దోహదపడుతుందన్నారు. యాప్‌లో పొందుపర్చిన 27 ప్రశ్నల ద్వారా వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. ఆయా కుటుంబాలకు ఏమైనా అపోహలు ఉంటే వాటిని తొలగించి సర్వేను విజయవంతంగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస గౌడ్ పాల్గొన్నారు.

యువకుడు దుర్మరణం

డోన్ టౌన్: బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని చిన్న మల్కాపురం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. యర్రగుంట్ల గ్రామానికి చెందిన నాగేశ్వరరావుకు కుమార్తె ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడైన మధు (22) పట్టణంలోని ఓ బైక్ షోరూంలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. రంగాపురంలో ఉంటున్న అక్క దగ్గరకు వెళ్లడానికి శుక్రవారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. చిన్న మల్కాపురం గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

బేస్ బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రామకృష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి సీనియర్ బేస్ బాల్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు సత్యసాయి జిల్లా కదిరిలో జరిగే 7వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారుల విజయ సాధన కోసం కృషి చేస్తూ బేస్‌బాల్ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్న పీఈటీ పుల్లయ్యను డైరెక్టర్ షేక్షావలి రెడ్డి అభినందించారు.

నిత్యావసర సరుకుల ధరల సేకరణ


ధరలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలోని సుస్మిత, రఫి కిరాణం, జనరల్ స్టోర్స్‌లో విక్రయిస్తున్న నిత్యావసర సరుకుల ధరలను ఆర్డీఓ కార్యాలయ ఏఎస్ఓ నాగరాజు, స్థానిక ఏఎస్ఓ హనుమంతు శుక్రవారం సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరులో రెండు, జూపాడుబంగ్లాలో రెండు కిరాణం దుకాణాలను ఎంపిక చేసి వాటిల్లో విక్రయిస్తున్న నిత్యావసర సరుకుల ధరలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాల వారిగా ఉత్పత్తి అవుతున్న ధాన్యం, వినియోగిస్తున్న సరుకుల డిమాండ్, ధరల వివరాలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి వెళ్లి, తద్వారా సరుకుల సరఫరా, ధరల నియంత్రణపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరు: మండలంలోని పెద్దనంతపురం గ్రామంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమితి జిల్లా అధ్యక్షులు వాదం నాగేషులు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జి, జిల్లా అధికార ప్రతినిధి బాషపోగుల దరగయ్య మాదిగ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక వర్గాలను కలుపుకుని మహాజన సోషలిస్ట్ పార్టీని బలోపేత చేస్తూ మనం సాధించుకున్న రిజర్వేషన్ ఫలాలను మన జాతి బిడ్డలకు అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పుల్లయ్య, తిమ్మరాజు, చిన్నపుల్లన్న, రంగస్వామి, మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మారెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17న బహిరంగ చర్చా వేదిక

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఉపాధి హామీ పథకం సోసల్ ఆడిట్ బహిరంగ చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు మండలంలో చేపట్టిన పనులపై ప్రస్తుతం 19వ విడత సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. తనిఖీ బృందాలు మండలంలో పర్యటిస్తూ పనుల వివరాలు సేకరిస్తున్నారన్నారు. కార్యక్రమానికి అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, వేతన దారులు, సామాజిక భద్రత పింఛన్ దారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

బీఎల్‌ఓల పాత్ర కీలకం

వెలుగోడు: ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని తహసీల్దార్ శ్రీనివాసగౌడు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఓటర్ నమోదు పత్రాలను ఏ విధంగా పూర్తి చేయాలి, క్లైయిమ్స్ ఎంక్వయిరీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

పగిద్యాల: స్థానిక 11కేవీ విద్యుత్‌సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ వేళల్లో మార్పులు చేసినట్లు ఏఈ క్రాంతికుమార్ తెలిపారు. ప్రాతకోట, లకోష్మీపురం, ముచ్చుమర్రి ఫీడర్ల కింద ఉదయం 5 గంటల నుంచి బోరు బావుల వద్ద విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల్లోపు విద్యుత్ పునరుద్ధరణ చేయనున్నట్లు తెలిపారు. మార్పులను గమనించి వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

- మహానంది: మహానంది మండలంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, మెయింటినెన్స్ కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం

వెలుగోడు: పట్టణంలో శనివారం వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తెలిపారు. శుక్రవారంవారు మాట్లాడుతూ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నేతలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

- మహానంది: నంద్యాలలోని పద్మావతి నగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం ఉంటుందని పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు.

ఇద్దరికి గాయాలు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని పార్నపల్లె - కాకనూరు దారిలో దుద్దుకూరి సుంకన్న, అతని కుమారుడు సాత్విక్ ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు.. పార్నపల్లె నుంచి వికలాంగుడు సుంకన్న ట్రైసైకిల్‌పై కాకనూరు గ్రామానికి కుమారునితో కలిసి బయలుదేరారు. ఘటనా స్థలంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం వీరి ట్రైసైకిల్ ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. కాగా సుంకన్నకు ఇదివరకే జరిగిన ప్రమాదంలో ఒక కాలు కోల్పోగా మరోసారి ప్రమాదం జరగడం దురదృష్టకరమని స్థానికులు చర్చించుకున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


న్యాయ విజ్ఞాన సదస్సుపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరమని న్యాయవాది వెంకటమరణ తెలిపారు. శుక్రవారం కోర్టు నుంచి కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై పటేల్ సెంటర్ వరకు పారా లీగల్ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ విజ్ఞాన సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు సులభమైన రీతిలో వివాదాలను పరిష్కరిస్తామన్నారు. ఎన్నోఏళ్లుగా కోర్టులో పెడింగ్‌లో ఉన్న కేసులను ముందస్తుగా రాజీ కావాలనుకునే వారు కార్యక్రమం ద్వారా అప్పీలు లేని తీర్పులను పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు శోభరాణి, రెహ్మాన్, హుసేన్, శాలుమియ్య పాల్గొన్నారు.

రైతులు అభివృద్ధిబాటలో నడవాలి

- నాబార్డు ఏజీఎం కార్తీక్


ఎఫ్‌పీఓ సంఘం డైరెక్టర్లతో నాబార్డు ఏపీఎం కేఆర్‌డీ కార్తీక్

జూపాడుబంగ్లా: రైతులు అభివృద్ధి బాటలో నడవాలని నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కేఆర్‌డీ కార్తీక్ సూచించారు. శుక్రవారం మండలంలోని తాటిపాడు గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి బ్యాంకు, ప్రభుత్వం ఇచ్చే రుణాలను, రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంతో పాటు వ్యాపార, పశుపోషణ, వ్యవసాయంలో యంత్రాలు వినియోగించటం, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించటం వంటి వాటిపై పట్టుసాధించి ఆర్థికంగా వృద్ధి సాధించాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల డైరెక్టర్లు, సీఈఓలు ఎప్పటికప్పుడు రైతులతో సమావేశాలు నిర్వహించి వారు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభించేలా మార్గాలు మార్కెట్ సౌకర్యాలు అన్వేషించటం, పండించిన పండ్లు, కూరగాయలకు సరైన మార్కెట్ సౌకర్యం కల్పించటం వంటి వాటిపై దృష్టిసారించి అవసరమైన సౌకర్యాలు కల్పించటంలో కృషిచేయాలన్నారు. తద్వారా రైతులు పండించిన ధాన్యానికి, కూరగాయలకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశాలు మెరుగుపడతాయన్నారు. నాబార్డు ఎఫ్‌పీఓ సంఘాల్లోని రైతుల్లోని రైతులు అభివృద్ధి చెందేందుకు అన్నివిధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సంఘాల డైరెక్టర్స్ పరమేశ్వరరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వెంకటరంగారెడ్డి, మన్సూర్‌బాషా, పుల్లమ్మ, ప్రతాప్, ఏఈఓ నాగేశ్వరరావు, ఎంపీఈఓ మధు, శేఖర్ పాల్గొన్నారు.

నాటు సారా విక్రయిస్తే చర్యలు తప్పవు


బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ శాఖ సీఐ, సిబ్బంది

నందికొట్కూరు: చట్టానికి వ్యతిరేకంగా నాటు సారా తయారు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. శుక్రవారం నీలిషికారి పేటపై సోదాలు నిర్వహించారు. నీలిషికారి సుగుణ ఇంట్లో నాటు సారా తయారీకి ఉపయోగించే 94 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సుగుణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. సోదాల్లో ఎక్సైజ్ ఎస్ఐ జబ్రుల్లా, హెడ్ కానిస్టేబుల్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు తిమ్మయ్య, జయన్న డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కార్మికులు నిరాహారదీక్ష శిబిరం వద్ద చెవులు, కళ్లు మూసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. ఏజెన్సీలకు అప్పగించవద్దని, సమ్మె కాలంలో ఒప్పందం ప్రకారం ఎక్స్‌గ్రేషియా రూ.7 లక్షలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు రాజు, విజయ్‌కుమార్, రాజేష్, సువర్ణమ్మ, సుశీలమ్మ, జీవరత్నమ్మ, కుమారమ్మ పాల్గొన్నారు.

మహానందీశ్వర దంపతులకు పల్లకోత్సవం


మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందీశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి. సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ముందుగా గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులను ప్రత్యేకంగా అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, హారతులు, బలిహరణ అనంతరం పల్లకీలో కొలువు తీర్చారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం నిర్వహించారు.

- మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.
- ఆషాఢ మాసం సందర్భంగా మహానందిలోని ఈశ్వర్‌నగర్‌లో కొలువైన సుంకులా పరమేశ్వరీదేవికి మహిళలు శుక్రవారం చీర, సారెతోపాటు బోనాలు సమర్పించారు.

పంటను దెబ్బ తీస్తున్నాయని...

- విష గుళికలు కలిపి 16 కోళ్లను చంపేసిన వైనం


విషాహారం తిని మృతి చెందిన కోళ్లు

రుద్రవరం: శ్రీరంగాపురం గ్రామానికి చెందిన ఓ రైతు కక్షకు 16 కోళ్లు మృత్యువాత పడ్డాయి. బాధితులు శ్రీనివాసులు, కొండయ్య, నాగేంద్రమ్మ శుక్రవారం తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని కొత్త కాలనీలో నివాసముంటున్న వారు ఇళ్ల వద్ద నాటు కోళ్లను పెంచుకుంటున్నారు. అయితే రోడ్డుకు అవతలివైపున ఓ రైతు తన పొలంలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పంట సంరక్షణకు చుట్టూ కంచె వేశాడు. అయితే కాలనీ వాసులు పెంచుకునే కోళ్లు పొలంలోకి వెళ్లి పంటను దెబ్బతీస్తాయని వాటికి బియ్యం, నూకలు వంటి వాటిలో విష గుళికలు కలిపి చల్లాడు. అవి తినగానే 16 కోళ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. మరి కొన్ని కొన ఊపిరితో కొట్టుకుంటున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహమ్మద్ రఫి తెలిపారు.

వాహనాల తనిఖీ

బండి ఆత్మకూరు: నంద్యాల- ఆత్మకూరు రహదారిలోని కేసీ కెనాల్ వద్ద శుక్రవారం ఎస్ఐ జగన్మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పద వాహనాలను ఆపి పరిశీలించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ లేని వాహనాలకు జరిమానా విధించారు.

యువకుడి ఆత్మహత్య


షేక్ జాకీర్ హుసేన్ (ఫైల్)

నందికొట్కూరు: పట్టణంలోని సంగయ్యపేటకు చెందిన దస్తగిరి, ముంతాజ్ దంపతుల చిన్న కుమారుడు షేక్ జాకీర్ హుసేన్(30) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. తండ్రి దస్తగిరి ఇరిగేషన్ శాఖలో అటెండర్‌గా పనిచేస్తూ సర్వీస్‌లో ఉండగానే మృతిచెందాడు. తండ్రి ఉద్యోగం పెద్ద కుమారుడు అల్తాఫ్ తీసుకుని, చిన్నకుమారుడికి రూ.12 లక్షలు ఇచ్చేందుకు కుటుంబ సభ్యులు నిర్ణయించారు. అయితే సోదరుడు రూ.12 లక్షలు ఇంత వరకు ఇవ్వలేదు. మరోవైపు షేక్ జాకీర్ హుసేన్ కర్నూలులో చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తుండటంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. తండ్రి ఇంటిని రూ.18 లక్షలకు తాకట్టు పెట్టినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.